

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY









PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 27-12-2025 సంపుటి : 07 సంచిక 228 పేజీలు : 8 వెల : రూ 3-00


# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే



**రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోం**

**పోస్టర్లపై జంతు రక్తం చల్లి భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతి ఏమిటి?**

**గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టిన పోలీసులకు అభినందనలు**

**అతిపెద్ద ఆధ్యాత్మిక క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు**

**తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

తిరుపతి, ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, కలియుగ వైకుంఠమైన తిరుమల పవిత్రతను కాపాడుతూ, భక్తులకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు భద్రతా భావం కల్పించే బాధ్యత పోలీసులదేనని సీఎం అన్నారు. తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని హోం మంత్రి వి.అనితతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న విజిటర్స్ పుస్తకంలో సీఎం తన అభిప్రాయాలను, సూచనలను రాశారు. అంతకుముందు సీఎం పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. టెక్నాలజీని వాడుకుని నేర నియంత్రణ చేయాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. నేరస్తుల కంటే పోలీసులు ఎక్కువ ఆలోచించగలగాలని.. వారెన్ని డ్రామాలు ఆడినా టెక్నాలజీ సాయంతో పట్టుకోవాలని స్పష్టం చేశారు. నేరస్తుల కంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని సీఎం అన్నారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కలియుగ వైకుంఠమైన శ్రీవేంకటేశ్వరస్వామి నెలకున్న ఈ ప్రాంత పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రౌడీయిజంపై ఉక్కుపాదంరాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని... సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్ర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సీఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టు పట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్ చేయటం, రప్పా రప్పా లాడించటం ఏమిటో ఎవరికీ అర్థం కావటం లేదన్నారు. బంగారు పాళ్యంలో మామిడి కాయలు తొక్కించారని.. గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఆ తర్వాత అంబులెన్సులో తీసుకెళ్లి చంపేశారని వారి బంధువులతో చెప్పించారని సీఎం వ్యాఖ్యానించారు. ఈ తరహా ఘటనల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, కత్తులతో జంతు బలులు ఇచ్చి పోస్టర్లపై రక్తం చల్లి సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, అసభ్య పోస్టులు పెట్టే వారిపై ప్రభుత్వం నిఘా ఉంచిందని సీఎం తెలిపారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల్లో ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడటం లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వంపై కొందరు బురద చల్లే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తిరుపతిలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులను సీఎం అభినందించారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ అరికట్టడంలోనూ, పీడీ యాక్టుల అమలులోనూ పోలీసులు చూపుతున్న చొరవను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్త సహా ఇతర సీనియర్ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుంది: ఆర్ఎస్ఎస్ చీఫ్



తిరుపతి, డిసెంబర్ 26: మనిషిలోని క్షమాగుణమే అతడిని ఉన్నత స్థితిలో నిలుపుతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుపతిలోని సంస్కృతి యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు జరగనున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు నాయుడితో కలిసి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రారంభించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ.. మనమంతా ఈ ప్రపంచానికి ఎంతో కొంత రుణపడి ఉన్నామన్నారు. మానసిక సంతృప్తి లేకపోతే ఎంత పొందినా సుఖం కలగదని పేర్కొన్నారు.కొందరిలో ఎంత ఎదిగితే అంత అహంకారం పెరుగుతుందని చెప్పారు. ప్రపంచానికి భారత్ ఎంతో కొంత ఇవ్వాలన్నారు. మనుషులందరికీ సౌఖ్యం, సదుపాయాలు కావాలని చెప్పారు. సుఖమనేది కేవలం భౌతికపరమైనదని ఆయన అభివర్ణించారు. సుఖ దు:ఖాలు తాత్కాలికమైనవన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అభివృద్ధితోపాటే వినాశనం సైతం వచ్చేసిందంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర విజ్ఞానంతోనే మానవాళికి సదుపాయాలు కలుగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మనం పొందుతున్న వాటిలో రెండో కోణం కూడా ఉంటుందన్నారు.కచ్చితంగా ప్రపంచంలోనే భారత్ గొప్ప దేశం అవుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశం ఉన్నత స్థితిలోకి రావడంతోపాటు.. ప్రపంచానికి మన దేశం ఏమి ఇవ్వగలమే అంశంపై దృష్టి పెట్టాలని ప్రజలకు ఆయన సూచించారు. సృష్టిలో ప్రతి ఒక్కరికీ సుఖం కావాలన్నారు. మనిషి సాధించే జ్ఞానంతో సుఖాన్ని సాధించాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అభిప్రాయపడ్డారు. ఆహారం, నిద్ర, మైథునం జంతువులకు ఆనందాన్ని ఇస్తాయని.. జంతువు కంటే మనిషి భిన్నమైన వాడని తెలిపారు. ఏ జంతువు ఆత్మహత్య చేసుకోదన్నారు. శరీరము, మనసు, బుద్ధి, ఆత్మ ఉన్నదని తెలిసిన వాడు మనిషని ఆయన తెలిపారు.భౌతిక అవసరాలు తీర్చుకోవడం మాత్రమే వికాసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో సుఖంగా ఉన్నవాళ్లు దుఃఖంతో ఉన్నవారంటూ రెండు వర్గాలుగా తయారు కాకూడదని హితవు పలికారు. మనుషులంతా సుఖంగా ఉండాలని కోరుకోవాలని.. అహంకారంతో ఉండకూడదని ఆయన సూచించారు. భౌతిక అంశాల జ్ఞానాన్ని విజ్ఞానమని.. అంతర్ జ్ఞానాన్ని జ్ఞానమని అంటారని వివరించారు. విజ్ఞానంతో మాత్రమే కొట్టుకుపోకూడదని చెప్పారు.భారతీయ విజ్ఞాన సమ్మేళనం లక్ష్యం జ్ఞానమని.. దీనిని ప్రపంచంలోని అందరికీ దగ్గర చేయాల్సి ఉందన్నారు. ఎవరికి ఏ భాష వచ్చొ ఆ భాషను ప్రజలకు అందుబాటులోకి తీసుకుపోవాల్సి ఉందని తెలిపారు. అప్పుడే అందరిలో బుద్ధి వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారతీయుల డీఎన్ఏలో మాత్రమే ధర్మ దృష్టి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారత్ విశ్వ గురువు కావాలని ఆకాంక్షించారు. ఆర్థిక, సామాజిక, ధర్మ జ్ఞానాల్లో సంపూర్ణంగా మనం ప్రపంచానికి శక్తిని..దృష్టిని.. ఇవ్వాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తెలిపారు.

# నిమ్మకూరు రావడం ఓ స్వీట్ మెమోరీ: భువనేశ్వరి

కృష్ణా జిల్లా, డిసెంబర్ 26: విద్యార్థులు సమాజాన్ని, దేశాన్ని లీడ్ చేసేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి అన్నారు. నిమ్మకూరులో పర్యటించిన భువనమ్మ.. గురుకుల పాఠశాల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించి.. వారితో తన బాల్య స్మృతులను పంచుకున్నారు. స్కూల్ చదువు పూర్తి చేసుకుని బయటకు వచ్చే సమయంలో జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆంగ్లంలో ప్రతిభ కనబర్చేలా అధ్యాపకులు చూడాలన్నారు. తాను నిమ్మకూరు రావడం స్వీట్ మెమోరీ అని.. ఇది తన తాత లక్ష్మయ్య ఊరు అని తెలిపారు. చిన్నపుడు సెలవులు వస్తె అమ్మ తమను నిమ్మకూరుకు పంపేదని... వేసవి సెలవలకు ఇక్కడికే వచ్చే వాళ్ళమని చెప్పుకొచ్చారు.ఇక్కడ తన సోదరి శారద ఉండేదని.. ఆర్టీసీ బస్‌లో పామర్రు సినిమా వెళ్ళేవాళ్ళమంటూ ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కాలం మారుతుందని.. ఇప్పుడు ఫోన్, కార్లు కావాలని కోరుకుంటున్నారని అన్నారు. బాలికలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ రోజు మీరు చేసే పనే రేపటి జీవితానికి దారి చూపుతుందని వెల్లడించారు. పెద్ద పెద్ద నాయకులు చాలా కష్టపడి చదువుకున్నారని.. అన్ని ఉండి చదువుకునే వారిని కాకుండా పేదరికంలో ఉండి చదువుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాన్న ఇంటింటికీ తిరిగి పాలు అమ్మి కష్టపడి పైకి వచ్చారని.. తాము ఈ స్థాయిలో ఉన్నాము అంటే తమ తల్లిదండ్రుల కష్టమని గర్వంగా చెప్పుకున్నారు.సీఎం చంద్రబాబు కూడా చాలా కష్టపడి చదువుకున్నారని తెలిపారు. చంద్రబాబుపై నమ్మకంతో ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత సీఎంగా ఎన్నుకున్నారన్నారు.

# సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

## అవార్డులను అందచేసిన రాష్ట్రపతి ముర్ము





న్యూఢిల్లీ,డిసెంబర్ 26): న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణం ఆమె ప్రశంసించారు. వయసుకు మించి ధైర్యసాహసాలు, ప్రతిభను ప్రదర్శించే చిన్నారులకు 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఏటా పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ సహా పలువురు చిన్నారులు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకున్నారు. పురస్కార గ్రహీతల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వీరిలో వ్యోమప్రియ ప్రదర్శించిన సాహసం, శ్వాన్ సింగ్ ఉదారత పలువురి హృదయాలను కదిలించింది.కరెంట్ షాక్ నుంచి ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన 8 ఏళ్ల చిన్నారి వ్యోమ ప్రియ తరపున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ రాష్ట్రపతి నుంచి పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా కుమార్తె తరపున ఈ అవార్డు తీసుకుంటున్నా. అప్పుడు మా అమ్మాయికి ఎనిమిదేళ్ళు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పిల్లల పార్క్‌లో మిగతా చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై ఏర్పాటు చేసిన స్లైడ్‌పై ఆడుకుంటున్న ఆరేళ్ల పిల్లాడు అకస్మాత్తుగా పడిపోయాడు. ఆ చిన్నారిని కాపాడదామని వెళ్లిన నా కూతురుకు కరెంట్ షాక్ తగిలింది. ఆ ఘటనలో మా ప్రియతో పాటు ఆ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. కేబుల్ దెబ్బతిని ఉండటంతో స్లైడ్‌కు షాక్ రావడమే అందుకు కారణమైంది. అంత చిన్న వయసులోనే ధైర్యం ప్రదర్శించిన నా బిడ్డ ఇప్పుడు నేరుగా వచ్చి ఈ అవార్డు తీసుకొని ఉంటే ఎంతో సంతోషించేవాళ్లం అంటూ అర్చనా ఉద్వేగభరితంగా చెప్పారు. 2024 మేలో తమిళనాడులోని కొయంబత్తూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఓ పదేళ్ల బాలుడు మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. అతడే శ్వాన్ సింగ్. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్వాన్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది. ఈ అవార్డును తాను కలలో కూడా ఊహించలేదని చిన్నారి సంతోషం వ్యక్తంచేశాడు. ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహిస్తారు.




# సంపాదకీయం

శనివారం 27-12-2025

## ఓ వైపు బంగ్లాదేశ్.. మరో వైపు పాకిస్తాన్

బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ పాకిస్తాన్ విషయంలో చాలా కఠినంగా ఉండేవారు. బంగ్లాదేశ్‌ను గుర్తించకపోవడంతో పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫికార్ అలీ భుట్టోతో మాట్లాడేందుకు షేక్ ముజిబుర్ రెహమాన్ నిరాకరించారు. పాకిస్తాన్ మొదట బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని తిరస్కరించింది. తర్వాతి రోజుల్లో పాకిస్తాన్ వైఖరి మారింది. 1974 ఫిబ్రవరిలో ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ సమ్మిట్ లాహోర్‌లో జరిగింది. జుల్ఫికార్ అలీ భుట్టో అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నారు. ముజిబుర్ రెహమాన్‌కు అధికారిక ఆహ్వానాన్ని పంపించారు. ముజిబ్ మొదట హాజరు కావడానికి నిరాకరించినా తరువాత అంగీకరించారు. పాకిస్తాన్ 1974 ఫిబ్రవరి 22న బంగ్లాదేశ్‌ను గుర్తించింది. భుట్టో ఈ గుర్తింపును 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్'లో ప్రకటించారు."అల్లా కోసం మా దేశ పౌరుల తరఫున మేం బంగ్లాదేశ్‌ను దేశంగా గుర్తిస్తున్నాం. రేపు ఒక ప్రతినిధి బృందం వస్తుంది. 7 కోట్ల మంది ముస్లింల తరఫున మేం వారిని ఆలింగనం చేసుకుంటాం" అని జుల్ఫికార్ అలీ భుట్టో అన్నారు. అయినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిస్థాయిలో దారినపడలేదు. కానీ, ఇప్పుడు సుమారు 52 ఏళ్ల తరువాత రెండు దేశాల మధ్య పరిస్థితులు మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. షేక్ హసీనా అధికారం కోల్పోయిన తర్వాత బంగ్లాదేశ్, పాకిస్తాన్ మధ్య చారిత్రక దూరం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. బంగ్లాదేశ్‌లో ఇంక్విలాబ్ మంచ్ నాయకుడు ఉస్మాన్ హాదీ డిసెంబర్ 18న మరణించారు. డిసెంబర్ 12న ఢాకాలో గుర్తు తెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. గతవారం.. బంగ్లాదేశ్‌లో ఫ్యాక్టరీ కార్మికుడైన హిందూ యువకుడిని ఒక గుంపు కొట్టి చంపింది. ఈ సంఘటన తర్వాత భారత్-బంగ్లాదేశ్ సంబంధాల్లో ఉద్రిక్తత పెరిగింది. ఆ తర్వాతి పరిణామాలతో రెండు దేశాల మధ్య వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. డిసెంబర్ 20న, పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ మాజీ అధ్యక్షుడు అమీర్ సిరాజ్-ఉల్ హక్ బంగ్లాదేశ్ యువతను ప్రశంసిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు."బంగ్లాదేశ్‌లోని విద్యావంతులు, ధైర్యవంతులైన యువత అఖండ భారత్ అనే ఆలోచనను ధ్వంసం చేసింది. భారత్ ఈ ప్రాంతంలో అస్థిరతను సృష్టిస్తోంది. కెనడా, పాకిస్తాన్ తర్వాత బంగ్లాదేశ్‌లో భారత్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హత్యలు చేస్తోందనే ఆరోపణలు వచ్చాయి" అని ఆయన అందులో రాశారు. ఉస్మాన్ హాదీ హంతకులు భారత్‌లో తలదాచుకున్నారని బంగ్లాదేశ్‌లోని సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి. అయితే దీనిపై బంగ్లాదేశ్ పోలీసులు కానీ, ప్రభుత్వం కానీ అధికారికంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రెండు దేశాల్లోనూ సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న వదంతులు భారత్- బంగ్లా మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. బంగ్లాదేశ్‌లోని భారత్ దౌత్య కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. హిందూ యువకుడి హత్యను నిరసిస్తూ దిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ఎదుట ఆందోళన జరిగింది. భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై భారత విదేశీ వ్యవహారాల శాఖ డిసెంబర్ 17న స్పందించింది"బంగ్లాదేశ్‌లో ఇటీవలి కొన్ని సంఘటనలకు సంబంధించి ఛాందసవాద శక్తులు చేసిన తప్పుడు వాదనలను మేం తిరస్కరిస్తున్నాం. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఈ సంఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టకపోవడం లేదా భారతదేశంతో ఎలాంటి నిర్దిష్ట ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరం" అని తన ప్రకటనలో పేర్కొంది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి పారిపోయి భారత్ వచ్చినప్పటి నుంచి పాక్- బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగవడం మొదలైంది. పాక్- బంగ్లాదేశ్ మధ్య దూరం నిరంతరం తగ్గుతున్నట్లు కనిపించే అనేక సంఘటనలు జరిగాయి. 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం తర్వాత నిరుడు నవంబర్‌లో పాక్- బంగ్లా మధ్య తొలిసారి నేరుగా సముద్ర వాణిజ్యం జరిగింది. గతంలో రెండు దేశాల మధ్య సముద్ర వాణిజ్యం సింగపూర్ లేదా కొలంబో ద్వారా జరిగేది."పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవుకు నేరుగా కార్గో నౌక చేరుకోవడం ఇదే తొలిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలకమైన ముందడుగు" అని బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హై కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్ నిరుడు నవంబర్ 6న "పాకిస్తాన్‌లోని బంగ్లాదేశ్ పౌరులకు ఉచితంగా వీసాలు ఇస్తాం. వారి వీసా దరఖాస్తులపై 48 గంటల్లోపు నిర్ణయం తీసుకుంటాం. వారు చేయాల్సిందల్లా వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అందించడమే. వీసాలలో వ్యాపార, పర్యటక వీసాలున్నాయి. టూరిస్టు వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు రిటర్న్ టికెట్, వసతి గురించి సమాచారం అందిస్తే చాలు" అని చెప్పారు. షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ కీలకమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్నట్లు కనిపిస్తోంది. పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ, బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ మధ్య సైద్ధాంతిక సారూప్యత ఉంది. బంగ్లా విముక్తి యుద్ధంలో భారత్ పాత్రను జమాత్ ఏ ఇస్లామీ ప్రశ్నిస్తోంది. షేక్ హసీనా నిష్క్రమణ తర్వాత ఢాకాలోని బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి చెందిన చారిత్రక వారసత్వంపై దాడులు, విధ్వంసం జరిగాయి.

## ఉన్నత విద్యావంతుల చేతుల్లోకి పల్లెల పాలన



కారేపల్లి, డిసెంబర్ 26 : ప్రజా సేవ, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పలువురు ఉన్నత విద్యావంతులు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా నిలిచి గెలిచారు. చదువుల్లో రాణించిన వారు రాజకీయ పరీక్షల్లో ప్రజల ఆశీస్సులతో గ్రామ పంచాయతీ ప్రథమ పౌరులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ నెల 17న ఖమ్మం జిల్లాలో జరిగిన మూడో విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సింగరేణి(కారేపల్లి) మండలంలో గల 41 గ్రామ పంచాయతీల్లో చాలా చోట్ల పంచాయతీ పాలకవర్గాలు ఉన్నత చదువులు చదివిన విద్యావంతుల చేతుల్లోకి వెళ్లాయి. ఈసారి చాలామంది సర్పంచులు మొదటిసారి గెలిచి ఉన్నత భావాలతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముందుకు వచ్చారు. పల్లెలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఈ నెల 23న గ్రామ పంచాయతీ సర్పంచులు (ప్రథమ పౌరులు) గా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో అప్పాయి గూడెం నుండి 1.దండు ప్రవీణ్ (బీటెక్-మెకానికల్), 2.గాదెపాడు.. భూక్య రంజిత్ కుమార్ (ఎంటెక్, బిఈడి), 3.గంగారంతండా.. నునావత్ కిరణ్ కుమార్ (ఇంటర్), 4.మాదారం.. అజ్మీర ఉమారాణి (బిఏ. బిఈడి), 5.నానునగర్ తండా.. మాలోత్ విజయ కుమారి (బిఈడి, డిఈడి), 6.పోలంపల్లి.. ధరావత్ హేమలత (ఎంబీఏ, ఎల్ఎల్‌బీ), 7.సింగరేణి.. మేదరి వీర ప్రతాప్ (ఎంబీఏ), 8.టేకులగూడెం.. గుమ్మడి సందీప్ (ఎంఏ.బిఈడి), 9.తొడిదలగూడెం..బానోత్ ప్రియాంక (బీఎస్సీ.బీఈడీ), 10.ఉసిరికాయలపల్లి.. గూగులోత్ వరలక్ష్మి (ఎంఎస్సీ.బీఈడీ) వీరితో పాటు ఇంకొంత మంది టెన్త్ ఆపై చదువులు చదివిన వారు సర్పంచులుగా ఎన్నికయ్యారు.

## ఎయిర్ ప్యూరిఫైయర్స్‌పై జీఎస్‌టీ తగ్గింపు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను వ్యతిరేకించిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫైయర్స్‌పై జీఎస్‌టీ తగ్గింపు అంశంపై ఢిల్లీ హైకోర్టు ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జీఎస్‌టీ తగ్గింపు అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి 10 రోజుల సమయం ఇచ్చింది. ఢిల్లీలోని గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్నందువల్ల ఎయిర్ ప్యూరిఫైయర్ల ను మెడికల్ డివైసెస్‌గా వర్గీకరించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో అడ్వకేట్ కపిల్ మదన్ ప్రజా ప్రయోజనాల వాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై రెండు రోజుల క్రితం విచారణ జరిపిన న్యాయస్థానం దేశ రాజధాని నగరం ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫయర్స్‌పై వస్తు, సేవల పన్ను (జీఎన్‌టీ)ని ఎందుకు తాత్కాలికంగా మినహాయించలేకపోతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇక ఈ అంశంపై ఢిల్లీ కోర్టు ఇవాళ మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జీఎస్‌టీ తగ్గింపుపై నిర్ణయం తీసుకునేందుకు జీఎస్‌టీ మండలికి ఇబ్బందేమిటని ప్రశ్నించింది. అయితే, ఎయిర్ ప్యూరిఫైయర్లపై జీఎస్‌టీ తగ్గింపు కోరుతూ ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కేంద్రం వ్యతిరేకించింది. అది ఆమోదయోగ్యం కాదని వాదించింది. వైద్య పరికరాల వర్గీకరణను ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని, ఈ విషయంపై జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. జీఎస్‌టీ కౌన్సిల్ ఒక రాజ్యాంగ సంస్థ అని.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇందులో పాల్గొంటున్నందున జీఎస్‌టీ తగ్గింపు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయలేమని కేంద్రం తరఫున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకట్రామన్ అన్నారు. ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. దీంతో కోర్టు 10 రోజుల సమయం ఇచ్చింది. అనంతరం తదుపరి విచారణను జనవరి 9కి వాయిదా వేసింది.



## కేరళలో చరిత్ర సృష్టించిన బీజేపీ, తిరువనంతపురం మేయర్‌గా వీవీ రాజేశ్

తిరువనంతపురం: కేరళలో బీజేపీ చరిత్ర సృష్టించింది. తిరువనంతపురం మేయర్‌గా బీజేపీ నేత వీవీ రాజేశ్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్‌గా ఎన్నికైన తర్వాత రాజేశ్ మాట్లాడుతూ కలిసికట్టుగా ముందుకు వెళ్తామన్నారు. అన్ని 101 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఓ అభివృద్ధి చెందిన నగరంగా తిరువనంతపురం మారుతుందన్నారు. ఇది చరిత్రాత్మక సందర్భం అని, ఇది కేరళ రాజకీయాల్లో మార్పు తెస్తుందని, తిరువనంతపురంలో జరిగిన మార్పు.. యావత్ రాష్ట్రాన్ని మార్చేస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. కేరళలో బీజేపీ ప్రాబల్యం తక్కువే. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న వీవీ రాజేశ్.. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొడుంగనూరు వార్డు కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ విక్టరీతో ఇప్పుడు ఆయన తిరువనంతపురం మేయర్‌గా మారారు. మరో ఆరు నెలల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజేశ్‌కు కీలక బాధ్యతలు దక్కాయి. 2016లో నీమమ్ సీటు నుంచి బీజేపీ అభ్యర్థిగా రాజాగోపాల్ గెలిచారు. ఆ తర్వాత 2024లో త్రిసూరు నుంచి సురేశ్ గోపి విజయం సాధించారు. మేయర్ రేసులో రాజేశ్‌కు 51 ఓట్లు పడ్డాయి. తిరువనంతపురం మున్సిపాల్టీలో మొత్తం 100 మంది సభ్యులు ఉన్నారు. సీపీఎంకు చెందిన ఆర్పీ శివాజీకి 29, కాంగ్రెస్ అభ్యర్థి కేఎస్ శబరినాథన్‌కు 19 ఓట్లు పోలయ్యాయి. ఓ ఇండిపెండెంట్ అభ్యర్థి గైర్హాజరు అయ్యారు. రెండో స్వతంత్ర్య కౌన్సిలర్ పీ రాధాకృష్ణన్ ఓటు విజయంలో కీలకంగా మారింది. డిసెంబర్ 9వ తేదీన జరిగిన వార్డు ఎన్నికల్లో బీజేపీకి 50 సీట్లు దక్కాయి.




## సీపీఐది చరిత్రాత్మక పోరాటం : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రామగిరి, డిసెంబర్ 26 : దేశంలో సామ్రాజ్యవాదం, భూస్వామ్య పెట్టుబడిదారులకు వ్యతిరేకనీగా, దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు చరిత్రాత్మకమైనవని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐ 101వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిపిఐ వందేండ్ల ముగింపు బహిరంగ సభ ఖమ్మం జిల్లాలో జనవరి 18వ తేదీన లక్షలాది మందితో జరుగుతుందని, ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో ఎలాంటి పోరాట చరిత్ర లేని బిజెపి నేడు కేంద్రంలో అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని కుని చేస్తూ పౌర హక్కులను కాలరాస్తూ దేశంలో అశాంతిని ప్రేరేపిస్తుందని దుయ్యబట్టారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ అడవుల్లో క్రూర మృగాలకంటే హీనంగా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపడం దారుణం అన్నారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగ, ఆర్థిక అసమానత్వాలను నిర్మూలన చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం మతం పేరుతో విద్వేషాలను సృష్టిస్తుందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో కరువు విలయ తాండవం చేస్తుంటే వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొస్తే దాన్ని నిర్వీర్యం చేయడం కోసం మహాత్మగాంధీ పేరు మార్చడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, బొల్గురి నర్సింహా, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, శాంతి సంఘనీ జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, నాయకులు ముండ్ల ముత్యాలు, మదర్, యూసుఫ్, ఐతరాజు శంకర్, దోటి పందరి, అక్కలయ్య, విజయ, పార్వతి, గౌస్ పాల్గొన్నారు.

## లేడీ మేనేజర్‌పై గ్యాంగ్ రేప్.. కంపెనీ సీఈవోతో పాటు మరో ఇద్దరి అరెస్టు



జైపూర్: రాజస్థాన్‌లోని ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళ గ్యాంగ్ రేప్‌కు గురైంది. ఈ ఘటన ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఆ కేసుతో లింకున్న ప్రైవేటు కంపెనీ సీఈవోతో పాటు మరో ఇద్దర్ని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఓ ప్రైవేటు కంపెనీలో సీఈవోగా చేస్తున్న జితేశ్ సిసోడియా.. వారం క్రితం బర్త్‌డే పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి మహిళా మేనేజర్ కూడా హాజరైంది. ఈ కేసులో మరో మహిళా ఎగ్జిక్యూటివ్, ఆమె భర్త గౌరవ్ సిరోహి నిందితులుగా ఉన్నారు. గురువారం ముగ్గుర్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నాలుగు రోజుల కస్టడీలోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద సుఖేర్ పోలీసు స్టేషన్‌లో కేసు బుక్ చేశారు. నిందితుల్ని రిమాండ్‌కు పంపినట్లు ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేశ్ గోయల్ తెలిపారు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత అతిథులు అందరూ వెళ్లిపోయారని, అయితే మహిళా ఎగ్జిక్యూటివ్ .. లేడీ మేనేజర్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని చెప్పింది. కారులో బాధిత మేనేజర్‌తో పాటు సిసోడియా,సిరోహి ఉన్నారు. దారిలో ఓ చోట ఆగి సిగరెట్లు కొన్నారని, ఆ సిగరేట్ తాగిన తర్వాత స్పృహ కోల్పోయినట్లు మేనేజర్ చెప్పింది. మరుసటి రోజు మళ్లీ నిద్ర లేచినట్లు పేర్కొన్నది. అయితే తనపై లైంగిక దాడి జరిగినట్లు అప్పుడు గుర్తించినట్లు ఆమె తెలిపింది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు రిజిస్టర్ చేశారు. నిందితుల్ని అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. లేడీ మేనేజర్‌పై మెడికల్ పరీక్షలు చేయించారు. ఆమె స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. ఏఎస్పీ మాధురీ వర్మకు దర్యాప్తు వివరాలు అందజేసినట్లు తెలుస్తోంది.

## రేవంత్‌రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమిది : లకావత్ గిరిబాబు

జూలూరుపాడు, డిసెంబర్ 26 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి సోయిలేని, పస లేని విమర్శలు అని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి పూర్తిగా బూతు మాటలకే పరిమితమై, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. కొడంగల్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రానికి దిశానిర్దేశం చేయాల్సిన ముఖ్యమంత్రే, ఇలా అనుచిత వ్యాఖ్యలతో వివాదాలు సృష్టించడం దురదృష్టకరమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలెన్ని రెండేండ్ల పాలనలో నెరవేర్చినవి ఎన్ని అని ఆయన ప్రశ్నించారు. హామీల గురించి ప్రశ్నించిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై వ్యక్తిగత దూషణలకు దిగడం రేవంత్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమయంలో ప్రజలు రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.




## వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలి: కలెక్టర్ రాహుల్ రాజ్

టేక్మాల్: వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. టేక్మాల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ, ఐపీ, ఫార్మసీ, ల్యాబ్, టాయిలెట్స్, పరిశీలించారు. వైద్యులు, అధికారులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళున్నామని తెలిపారు. వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# రచ్చకెక్కుతున్న టిక్కెట్ రేసు

విజయవాడ, డిసెంబర్ 26, ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైముంది. కానీ ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ రేసు రచ్చకెక్కుతోంది. మరీ ముఖ్యంగా టీడీపీలో టికెట్ ఫైట్ మామూలుగా లేదు. గత ఎన్నికల్లోనే దాదాపు 50 మంది నేతలు టికెట్ త్యాగం చేయాల్సి వచ్చింది. ఇందులో 20 మంది వరకు సీనియర్ లీడర్లు పార్టీ గెలుపు కోసం..పొత్తుల్లో సీటును వదులుకోవాల్సి వచ్చింది.మరికొన్ని చోట్ల యువనేతలకు నామినేటెడ్ పోస్టుల హామీ ఇచ్చి టికెట్ రేస్ నుంచి తప్పించారు. ఇంకొందరు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుతుందని..అప్పుడు కచ్చితంగా టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కట్ చేస్తే అసెంబ్లీ సీట్ల పెంపుపైన స్పష్టత వచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీలో 50, తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరగాలి. కానీ 2029 ఎన్నికల్లోపే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాదని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.అయితే 2026లో జనగణన చేపడుతుంటంతో ఇప్పుడు అసెంబ్లీ స్థానాల పెంపు చేయకుండా..సెన్సెస్ పూర్తయిన తర్వాత డీలిమిటేషన్ చేయాలని డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే అసెంబ్లీ, లోక్సభ ఎన్నికలు పాత నియోజకవర్గాలతోనే జరగనున్నాయి. 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఆశపడ్డ పార్టీలకు, రాజకీయ నేతలకు బిగ్ షాక్ ఇచ్చినట్లు అయింది. 2024లో కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ తమ నేతలకు సీట్లు సర్దుబాటు చేసేందుకు నానా అవస్థలు పడింది.గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు చేసేందుకు చివరి క్షణం వరకు బుజ్జగింపులు, సామాజిక సమీకరణాలు, పార్టీలో సీనియర్లకు హామీలు చాలా ప్రాసెస్ నడిచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల పంపకం కూడా టీడీపీ హైకమాండ్‌కు ఇబ్బందికరంగా మారింది.టీడీపీకి పట్టు ఉండి..లీడర్ స్ట్రాంగ్‌గా ఉన్న చోటే జనసేన, బీజేపీ టికెట్ కోసం పట్టుబట్టడంతో..చాలా మంది తెలుగు తమ్ముళ్లు సీటు త్యాగం చేశాయి. అధికారంలోకి వస్తే ఏదో పదవి దక్కుతుందని ఆశపడి..ఇప్పటికి ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోపు అసెంబ్లీ సీట్ల పెంపు అయ్యే పని కాదన్న క్లారిటీ వచ్చింది.టీడీపీ హైకమాండ్‌కు ఇప్పటినుంచే గుబులు మొదలైందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికలప్పుడే.. గెలుస్తున్నాం.. అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా మిమ్మల్ని స్యాటిస్ఫై చేస్తామని కింద మీద పడి హామీ ఒప్పించి టికెట్ త్యాగానికి ఒప్పించారు. ఈ సారి టికెట్ల కేటాయింపు ఎలా.? అసలే ఐదేళ్లు పవర్‌లో ఉంటాం. పైగా అసంతృప్తులు, లీడర్ల వర్గపోరు ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు ఇవన్నీ అడ్డంకిగా మారనున్నాయి. ఏం చేసేదని ఇప్పటినుంచే ఆలోచనలో పడిందట టీడీపీ అధిష్టానం.చాలాచోట్ల కూటమిలో వర్గపోరు నడుస్తోంది. స్టార్టింగ్లో కాస్త రచ్చకెక్కిన లీడర్లు..అధినేతల ఆదేశాలతో..సర్దుకోకపోయినా..గొడవ అయితే పడట్లేదు. కలిసి పనిచేయడం కూడా అంతంత మాత్రమే. ఇలాంటి పరిస్థితులున్న వేళ..అసెంబ్లీ ఎన్నికల టికెట్ రేసు..ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో కాక రేపుతోంది. అక్కడక్కడ తెలుగు తమ్ముళ్లే తగువ పడుతుంటే..మరికొన్ని చోట్ల, జనసేన, బీజేపీ నేతలతో టీడీపీ నేతలకు టికెట్ ఫైట్ నడుస్తోంది. ఎన్నికల టైమ్ వచ్చే సరికి టికెట్ రేసు, ఆశావహుల ప్రయత్నాలు జోరందుకోవడం ఖాయం. ఇప్పటినుంచే ప్రత్యామ్నాయం ఆలోచించడం..సాధ్యమైనంత వరకు లీడర్లకు టికెట్‌పై క్లారిటీ ఇవ్వడం వంటివి టీడీపీ అధిష్టానం మదిలో ఉన్న అస్త్రాలుగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో పాటు..కొందరిని పార్టీ పొలిట్ బ్యూరోలోకి.. మరికొందరిని జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు..ఇంకొందర్ని ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులుగా పంపించాలనేది బాబు ఆలోచనగా చెబుతున్నారు. సీట్ల సర్దుబాటు విషయంలో వచ్చే సవాళ్లను టీడీపీ అధిష్టానం ఇంకా ఎలా ఫేస్ చేయబోతోందో వేచి చూడాలి మరి.

## మేకపాటి స్థానంలో కొత్త నేత

నెల్లూరు, డిసెంబర్ 26, జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

## ఫేస్ నుంచి ఇంటింటి సర్వే

ఒంగోలు, డిసెంబర్ 26, ఏపీలోని కూటమి ప్రభుత్వం పేద వర్గాల ప్రజలు, మహిళల ఆర్థిక అభివృద్ధికోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. అయితే, తాజాగా.. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలను ప్రభుత్వ రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేందుకు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఏకీకృత కుటుంబ సర్వే –జఈూ ప్రారంభిస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభమవుతుందని ప్రభుత్వం వెల్లడించిందిపట్టణాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని రికార్డులను సిబ్బంది నవీకరించనున్నారు. అర్హత కలిగిన కుటుంబం, వ్యక్తి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడమే లక్ష్యంగా ఈ సర్వేను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా నిజమైన అర్హులను ప్రభుత్వం గుర్తించనుంది.ప్రభుత్వ సమాచారం కచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహించనుంది. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి వద్దకు వెళ్లి సిబ్బంది పొందుపర్చనున్నారు. ప్రభుత్వం ఖచ్చితంగా డేటా రూపొందించడం సహా పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది.ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ సిబ్బంది సర్వేను చేపట్టనున్నారు. తద్వారా సమాచారం ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా సాగేందుకు సర్వే ఉపయోగపడుతుందని ప్రభుత్వం తెలిపింది. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నవైకాపా నేతలు

విశాఖపట్నం,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి పుట్టిన రోజు సందర్భం గా వైసిపి శ్రేణులు వేట కొడవళ్లు వంటి మారణాయుధాలతో ప్రదర్శ నలు చేస్తూ ప్రజలను భయబ్రాంతు లకు గురిచేయడం శోచనీయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీని వాసరావు అన్నారు. మారణాయు ధాలు పట్టుకుని బహిరంగంగా ప్రద ర్శనలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదమని, ఇటువంటి చర్యలపై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి,

విజన్తో రాష్ట్రానికి పెట్టుబడిదారులు, ప్రము ఖ కంపెనీలు ఆకర్షితువు తున్నారని తెలిపారు. శాంతి, భద్రత, స్థిరమైన పాలన ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని చెప్పారు. పెట్టుబడిదా రులను భయపెట్టే కుట్రలో భాగంగా వైసిపి,జగన్ అనుయాయులు రాష్ట్రాన్ని అశాంతివైపు నెట్టే ప్రయ త్నం చేస్తోందన్నారు. ఈ హింసాత్మ క రాజకీయ సంస్కృతిని తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబో దని చెప్పారు

## పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు,

### గోవిందరాజు స్వామి టెంపుల్.. ఈ ఏడాదంతా తిరుపతి చుట్టే ఇలా..!

తిరుమల, డిసెంబర్ 26, ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది.గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.లేటెస్ట్ వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది.ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అక్రమాలన్నీ ఒక్కొక్కటి బయటికి తీస్తున్నామని కూటమి పెద్దలు చెప్తుంటే..ప్రతీదానికి వైసీపీకి లింకు పెట్టే కుట్ర చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ లీడర్లు రివర్స్ అటాక్ చేస్తున్నారు. తమను హిందూ వ్యతిరేకులుగా చూపించి..లబ్ధి పొందే ప్రయత్నమే తప్ప..అసలు వాస్తవాలేంటో తేల్చడంలో ప్రభుత్వం ఫెయిల్ అయిందంటున్నారు వైసీపీ నేతలు. రూమర్స్, గాలి ప్రచారమే తప్ప..ఎక్కడా తప్పు జరిగినట్లు ప్రూవ్ చేయలేదని..ఏడాది కాలంలో కూటమి సర్కార్ గోబెల్స్ ప్రచారంతో నెట్టుకొస్తుందని ఫ్యాన్ పార్టీ లీడర్లు విమర్శిస్తున్నారు.ఇలా కల్తీ నెయ్యి, పరకామణి చోరీ కేసు, పట్టు శాలువాల స్కామ్..ఇప్పుడు గోవిందరాజస్వామి బంగారం ఇష్యూపై..పొలిటికల్ వార్ నడుస్తుంది. మరోవైపు శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ వైడ్‌గా ఎంతో పేరు ప్రతిష్టలు.. అన్నింటికి మించి కోట్లాది మంది భక్తుల విశ్వాసంగా ఉన్న శ్రీవారి సన్నిధిలో వరుస సంఘటనలు కలకలం రేపుతున్నాయి. గోవిందరాజస్వామి ఆలయ గోపురం బంగారం వ్యవహారం..ఎటు టర్న్ తీసుకుంటుందో..ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందో వేచి చూడాలి.

## బెజవాడలో 51 పంచాయితీల విలీనం

విజయవాడ, డిసెంబర్ 26, అమరావతి రాజధాని నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. మరోవైపు విజయవాడ, గుంటూరు నగరాలతో అమరావతిని కలుపుతూ అభివృద్ధి చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేరే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అమరావతికి ఇంకా నగర రూపురేఖలు ఏర్పడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఐటీ కంపెనీలను తీసుకురావాలన్న ఆలోచనతో ఉంది. అందుకే ఇప్పుడు విజయవాడ ను గుర్తించి గ్రేటర్ గా మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 75 గ్రామపంచాయతీలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన త్వరలో అమలు చేయనున్నట్లు సమాచారం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ సివిక్ బాడీగా అప్గ్రేడ్ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సీఎం చంద్రబాబు నాయుడు ను కలిసి మహా విజయవాడ ప్రతిపాదనలను అందించారు. దీంతో విజయవాడ మహానగరం ఆవిర్భావానికి అడుగులు పడినట్లు అయింది. 2017లో నగరపాలక మండలి 51 పంచాయితీల విలీనం ప్రతిపాదన చేయగా.. ఇప్పుడు ఆ జాబితాలో మరో 24 పంచాయితీలను చేర్చారు. దీంతో విజయవాడ ప్రస్తుత జనాభా 23.5 లక్షల నుంచి రెట్టింపు కానుంది. నగర పరిమాణం ఐదు రెట్లు పెరగనుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రస్తుతం ఉన్న 61.8 చదరపు కిలోమీటర్ల నుంచి.. 500 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది.ఈ విలీన ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ఆమోదిస్తే.. విశాఖపట్నందాటి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా విజయవాడ అవతరించనుంది. అయితే ఈ విలీన ప్రతిపాదనను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. విలీనం కాకుండా వికేంద్రీకరణ కావాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనపై పౌర సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ ఆంధ్రప్రదేశ్ లో రెండో అతిపెద్ద నగరంగా ఉంది. గ్రేటర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కొన్ని వర్గాలు వ్యతిరేకించడం జరుగుతోంది. గతంలో హైదరాబాద్ విషయంలో కూడా ఇలానే జరిగింది. ప్రభుత్వం మాత్రం స్ట్రాంగ్ గా నిర్ణయించుకుంటే మాత్రం విజయవాడ గ్రేటర్ గా మారడం ఖాయం.తాజాగా విజయవాడను గ్రేటర్ సిటీగామార్చాలన్న ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో.. అమరావతిలో కలపాలన్న డిమాండ్ తెరమరుగు అయినట్టే. అయితే ఇప్పుడు రాష్ట్రానికి రాజధానికి దగ్గరగా ఒక నగరం అవసరం. ఐటీ పరిశ్రమలన్నీ విశాఖకు వెళ్ళిపోతున్నాయి. రాయలసీమలో తయారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. ఈ క్రమంలో అమరావతి రాజధాని లో ఎటువంటి పెట్టుబడులు లేవన్న విమర్శలు వస్తున్నాయి. అందుకే గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనను ఆమోదించి.. మహానగరంలో పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## తమ్మినేనికి చెక్...



శ్రీకాకుళం, డిసెంబర్ 26, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు విషయంలో నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రకంపనలు రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సీనియర్ నేత ధర్మాన కృష్ణ దాస్ చేసిన ప్రకటన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్టు ఉంది. సీనియర్ నేతగా ఉన్న ధర్మాన కృష్ణ దాస్.. ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కూడా. అయితే వచ్చే ఎన్నికల్లో తమ్మినేని పోటీ విషయంలో ఆయన చేసిన ప్రకటన మాత్రం పొలిటికల్ వర్గాల్లో హీట్ రేపుతోంది. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారామును తప్పించి మరొకరిని పోటీ చేయిస్తామన్న ధర్మాన కృష్ణ దాస్ ప్రకటనపై దువ్వాడ శ్రీనివాస్ విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నారు.కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసింది హై కమాండ్. వ్యక్తిగత కుటుంబ వివాదాలతో ఆయనపై వేటు వేయాల్సి వచ్చింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ కుట్ర ఉంది అన్నది దువ్వాడ చేస్తున్న ఆరోపణ. కింజరాపు కుటుంబంతో కలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారు. తన ఓటమి వెనుక ధర్మాన కుటుంబ హస్తం ఉందని కూడా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మాన బ్రదర్స్ పై పెద్ద యుద్ధమే ప్రకటించారు దువ్వాడ. దానికి కాళింగ సామాజిక వర్గం ను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఆ సామాజిక వర్గం ద్వారానే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇవ్వడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు.అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉండేవారు. ఆయనను తప్పించి యువకుడైన చింతాడ రవికుమార్ కు ఆ బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. అప్పటినుంచి తమ్మినేని సీతారాం కూడా మనస్థాపంతో ఉంటూ వస్తున్నారు. ఆయన సైతం కాళింగ సామాజిక వర్గానికి చెందిన నేత. ఇటువంటి పరిస్థితుల్లో టెక్కలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు కృష్ణదాస్. ఈ క్రమంలో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడుకు ధీటుగా సరైన అభ్యర్థిని రంగంలోకి దింపుతామని చెప్పుకొచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తమ్మినేని పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనకు పెద్దల సభకు కానీ ఎమ్మెల్సీ పదవి గానీ ఇస్తామని కృష్ణ దాస్ చెప్పడం దువ్వాడ శ్రీనివాస్ ఆయుధంగా మలుచుకున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తరుపైకి తెస్తూ.. కింజరాపు, ధర్మాన బ్రదర్స్ ను కేడి బ్రదర్స్ తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేరుగా హెచ్చరించలేదు. కానీ ధర్మాన బ్రదర్స్ కు హెచ్చరించడం ద్వారా హై కమాండ్ కు పరోక్ష సంకేతాలు పంపగలిగారు.

## కేవీపికాలనీలో కార్డెన్ సెర్చ్

**- 40వాహనాలు, 2 ఆటోలు సీజ్**

**- రౌడీషీటర్లకు ఎస్పీ వకుల్ జిందిల్ స్ట్రాంగ్ వార్నింగ్**

గుంటూరు ,నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేవీపీ కాలనీలో శుక్రవారం వెస్ట్ డీఎస్పీ అరవింద్ బాబు నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. 500 గృహాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి సరైన ధృవీకరణపత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలు సీజ్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని రౌడీషీటర్లు, గంజాయి కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. ఏ సమాచారం ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. నగరంపాలెం సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డిజి – లక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉపాధి--

## ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో త్వరలో ప్రారంభం -మెప్మా పీడీ వెంకటదాస్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26-పట్టణ పేద మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా అమలు చేస్తున్న డిజి – లక్ష్మి ఉపాధి పథకాన్ని నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో త్వరలో ప్రారంభిస్తామని మెప్మా పీడీ వెంకటదాస్



తెలిపారు. శుక్రవారం మెప్మా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, డిజి – లక్ష్మి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. మహిళలకు అవసరమైన శిక్షణ, మార్గనిర్దేశం, ఆర్థిక సహాయం అందించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో డిజి– లక్ష్మి పథకం ప్రారంభం వల్ల పట్టణ మహిళలకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని, పథకంపై అవగాహన పెరిగి మరింత మంది మహిళలు ఉపాధి అవకాశాలు పొందగలుగుతారని వెంకటదాస్ పేర్కొన్నారు. ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని, అతి త్వరలో ప్రారంభోత్సవ తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

# పన్నుల వసూళ్లలో చేతివాటం--


విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26-పట్టణంలో మున్సిపల్ పన్నుల వసూళ్లలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పన్ను వసూలు చేయాల్సిన



కింది స్థాయి సిబ్బంది కొందరు దుకాణదారులతో నెలనెలా కొంత మొత్తం పుచ్చుకొని, అధికారికంగా పన్నులు వసూలు చేయడం లేదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో వ్యాపార పన్నుల వసూళ్లు గణనీయంగా పడిపోతున్నాయని సమాచారం. పన్ను వసూలు సక్రమంగా జరగకపోవడానికి ఇదే ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మున్సిపల్ ఉన్నతాధికారులు వ్యాపార పన్నుల వసూళ్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించకపోవడం వల్ల భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ అభివృద్ధికి కీలకమైన పన్ను ఆదాయం ఇలా చేతివాటం కారణంగా నష్టపోతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి పన్ను వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకొని, అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# వైభవంగా అహోబిల నరసింహస్వామి పార్వేట ఉత్సవం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26:నంద్యాల పట్టణంలో అహోబిల నరసింహస్వామి పార్వేట ఉత్సవం భక్తుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని శ్రీ వినాయక మండపం వద్ద నుంచి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి పల్లకీలో ఆసీనులై ఘన ఊరేగింపుగా బయలుదేరారు. ఈ ఊరేగింపు కాళికాంబ గుడి మీదుగా గాంధీ చౌక్, బైర్మల్ వీధి గుండా సాగుతూ భక్తులను పరవశింపజేసింది. డప్పులు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఈ పార్వేట ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళికాంబ ఆలయం వద్ద ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి పల్లకీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంప్రదాయ విధానంలో తొమ్మిది హారతులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవం మొత్తం భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రశాంతంగా సాగింది.



# సిపిఐ 101వ ఆవిర్భవ దినోత్సవం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 26:భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నంద్యాల సిపిఐ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు జెండాను ఆవిష్కరించారు. సిపిఐ 101వ ఆవిర్భవ దినోత్సవ కార్యక్రమానికి




సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, జిల్లా నాయకులు మురళీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు, భాస్కర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, లక్ష్మీదేవి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు, పట్టణ నాయకుడు ధనుంజయ్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు హరినాథ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ భూమి కోసం, పేదల విముక్తి కోసం నిరంతర పోరాటాలు నిర్వహించిన ఏకైక పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి, వేల గ్రామాలను విముక్తి చేసి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని తెలిపారు. అటువంటి చారిత్రక పార్టీ జెండాను ఆవిష్కరించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ శాఖ నాయకులు, మహిళా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.5.33 కోట్ల సీహెచ్‌సీ ప్రారంభం--





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26:నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రూ. 5.33 కోట్ల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ నాబార్డ్ నిధులతో 30 పడకల ఆసుపత్రిని ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా నాణ్యమైన వైద్యం అందుతోందని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. గతంలో అత్యవసర చికిత్సకు నంద్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, యాళ్లూరులో ఆసుపత్రి ఏర్పాటుతో ఆ అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మదర్ అండ్ చైల్డ్ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైద్య సిబ్బంది నాణ్యమైనసేవలుఅందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ లలిత, హెచ్‌డీఎస్‌సీ సభ్యుడు వెంకట్ రెడ్డి, సూపరింటెండెంట్ డా. శ్రీరామ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భవన కార్మికుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి--

## బాల కార్మికులపై కఠిన చర్యలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26 :బిల్డింగ్స్ యాక్ట్ ప్రకారం పది మందికి మించి కార్మికులు పనిచేసే ప్రతి భవన నిర్మాణ పనిస్థలంలో కార్మికులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అన్ని నిర్మాణ పనులను 'మీ సేవ' ద్వారా నమోదు చేయించాలని సూచించారు. భవన నిర్మాణ సెస్‌ను ప్రతి నెల 10వ తేదీ లోగా జమ అయ్యేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు ప్రభుత్వ నిర్మాణాల నుంచి రూ. 9.21 కోట్లు, ప్రైవేట్ నిర్మాణాల నుంచి రూ. 1.96 కోట్లు సెస్ వసూలైనట్లు తెలిపారు. 20 మందికి మించి కార్మికులు ఉన్న చోట కార్మికులందరూ ఈపీఎఫ్‌లో నమోదు కావాలన్నారు. బాల కార్మికుల నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే 1098కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కార్మికులకు కనీస వేతనం, భద్రత, సంక్షేమ సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మెయిన్ బజార్‌కే శానిటేషన్--

## సందుల్లో మురుగు రాజ్యం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26-పట్టణంలో శానిటేషన్ పనులు కేవలం మెయిన్ బజార్‌లకే పరిమితమవుతున్నాయని పట్టణ ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.



లోపలి సందులు, గొందులలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు రోగాలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. సందుల్లో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు, మంత్రులు పర్యటించే ప్రాంతాల్లో మాత్రమే శానిటేషన్ పనులు చేపడుతూ, మిగతా ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నివసించే కాలనీల పరిస్థితి రోజురోజుకు అధ్వాన్నంగా మారుతున్నా అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. పట్టణం అంతటా సమానంగా శానిటేషన్ పనులు నిర్వహించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హిందూ సమ్మేళనానికి పిలుపు-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 26 :హిందూ సమాజ ఐక్యత, ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 28వ తేదీ న వైఎస్సార్ నగర్ ఫస్ట్ ట్యాంక్ సమీపంలోని గ్రౌండ్ లో హిందూ



సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ హిందూ సమ్మేళనానికి ప్రతి హిందువూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వైఎస్సార్ నగర్ టీడీపీ ఇంచార్జ్ దేరెడ్డి శివ నాగిరెడ్డి పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై ఈ సమ్మేళనం ద్వారా బలమైన సందేశం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హిందూ సమాజ భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమం కీలకమని తెలిపారు.

# ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26 :నంద్యాల పట్టణ ఆర్టీసీ బస్టాండ్‌లో పార్లమెంట్ నిధులతో రూ. 9 లక్షల వ్యయంతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా రోజూ వేలాది మంది ప్రయాణికులు, ఆర్టీసీ



కార్మికులకు శుద్ధి చేసిన మంచినీరు ఉచితంగా అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. బస్టాండ్‌లో పెయింటింగ్, డ్రైనేజీ, టాయిలెట్ల మరమ్మత్తులు, పార్కింగ్ సదుపాయాల వంటి అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ డా. బైరెడ్డి శబరి మాట్లాడుతూ, కలుషిత నీటితో వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉచితంగా శుద్ధి నీరు అందించడమే లక్ష్యమన్నారు. అవసరం ఉన్న ప్రాంతాల్లో మరిన్ని మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆర్టీసీ అధికా రులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గుంతల రోడ్డుపై స్కూల్ బస్సు--

## ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 26-నంద్యాల:ఎన్జీఓ కాలనీ ప్రధాన రోడ్డులో ఏర్పడ్డ గుంతలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రామాలయం వరకు సాగిన ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండే మార్గం కాగా, రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వాహనదారులు




ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో పలు పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, కోచింగ్ సెంటర్లు ఉండటంతో ప్రతిరోజూ స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతలను తప్పించుకుంటూ స్కూల్ బస్సులు ప్రయాణించాల్సి రావడంతో చిన్నారులకు అసౌకర్యం ఏర్పడుతోంది. వర్షాల అనంతరం గుంతలు మరింత పెరిగి రోడ్డు పూర్తిగా దెబ్బతిందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళ గుంతలు కనిపించక ప్రమాదాల ముప్పు పెరిగిందని చెబుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి గుంతలను పూడ్చి, రోడ్డును మరమ్మతులు చేయాలని ఎన్జీఓ కాలనీ వాసులు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190